بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 27.07.2018 (Telugu)**

## ఆహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుల విశ్వాసభరిత సంఘటనల ఆసక్తికర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 27.07.2018 తేదీన - మస్జిద్ మస్జిద్ బైతుల్ ఫుతూహ్-లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. అనుచరుల ప్రస్తావనలో భాగంగా నేడు నేను ఇద్దరు అనుచరుల గురించి ప్రస్తావిస్తాను. మొదటివారు హజ్రత్ ముజ్జిర్ బిన్ ముహమ్మద్ అన్సారి. హజ్రత్ ముజ్జిర్ బిన్ ముహమ్మద్ బనూ జఅజబాకు సంబంధించినవారు. మదీనాకు చేరిన తరువాత ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ముజ్జిర్ బిన్ ముహమ్మద్ మరియు తుఫైల్ బిన్ హారిస్‌నకు మధ్య సోదరభావము ఏర్పాటు చేసిరి. హజ్రత్ జైబర్ బిన్ అవ్వామ్ (రజి), హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ, హజ్రత్ అబూ సీరతు బిన్ అబీ రుహుమ్ మక్కా నుండి ప్రస్థానము చేసి మదీనా వచ్చినప్పుడు వారు హజ్రత్ ముజ్జిర్ బిన్ ముహమ్మద్ గృహములో నివాసముండిరి. హజ్రత్ ముజ్జిర్ బదర్, ఉహద్ యుద్ధములలో పాల్గొనిరి. బీరె మవూన సంఘటనలో వారు అమరులైరి. బీరె మవూన సంఘటన ఇట్లు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హిజ్రి 4 సం॥ సిఫర్‌లో ముజ్జిర్ బిన్ అమర్ అన్సారి నాయకత్వములో అనుచరుల ఒక బృందమును ఇస్లామీయ బోధనను తెలియపరచుటకు పంపిరి. వీరిలో అధికులు అన్సార్‌లోని వారు. వీరి సంఖ్య 70 వుండెను. వీరందరు పవిత్ర ఖుర్‌ఆన్ పాఠకులు. ఒక బావి వలన బీరె మవూన అనబడే ప్రాంతమునకు వీరు చేరినప్పుడు వీరిలోని ఒక వ్యక్తి అనస్ బిన్ మాలిక్‌కు మామయ్య అయిన హరామ్ బిన్ మల్‌హాన్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరఫున ఇస్లాం సందేశము అందించుటకు ఆమిర్ వర్గపు నాయకుడు అబూబరా ఆమిర్ సోదరుని కుమారుడు ఆమిర్ బిన్ తుఫైత్ వద్దకు ముందుగా వెళ్లిరి. మిగతా వారు వెనుక వుండిపోయిరి. హరామ్ బిన్ మల్‌హాన్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దూతగా ఆమిర్ బిన్ తుఫైల్, వారి స్నేహితుల వద్దకు చేరిరి. వారు మొదటగా దాంబికముతో ఎంతో గౌరవంగా ఆహ్వానించిరి. కనుక వారు నిశ్చింతగా కూర్చొని, ఇస్లాం సందేశము అందించడం మొదలు పెట్టగా వారిలోని కొందరు దుష్టులు ఒక వ్యక్తికి సంజ్ఞ చేసిరి. అతడు ఈ అమాయకుని వీపుపై బర్చితో దాడి చేసి హతమార్చెను. అప్పుడు హరామ్ బిన్ మల్‌హాన్ '**అల్లాహు అక్బర్ ఫుజ్తు వరబ్బిల్ కాబా**' అనగా అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు. నేను నా లక్ష్యమునకు చేరినాను అని అనుచుండిరి. ఆమిర్ బిన్ తుఫైల్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దూతను చంపడమే కాక బనూ సలీమ్ వర్గములోని బనూ రేల్, జక్వాన్‌ను తమ వెంట తీసుకొని ఇతర నిస్సహాయులైన అనుచరుల సమూహముపై దాడి చేసి అందరిని హతమార్చెను. ఒక అనుచరుని కుమారుడు కాబ్ బిన్ జైద్ వుండెను. అనుచరుల ఈ వర్గములోని ఇద్దరు వ్యక్తులు అమర్ బిన్ ఉమయ్య జమ్రీ, ముజ్జిర్ బిన్ ముహమ్మద్ అప్పుడు ఒంటెలను మేపడానికి తమ బృందము నుండి విడిపోయి చెల్లాచెదురైరి. వారు తిరిగి రాగా ఈ దృశ్యమును చూసి ఇట్లనిరి. మన నాయకుడు ముజ్జిర్ బిన్ అమర్ అమరులైన చోట మనము కూడ యుద్ధము చేస్తాము. ఈ విధముగా ముజ్జిర్ బిన్ ముహమ్మద్ మరియు వారి మిత్రుడు శత్రువులతో యుద్ధము చేసి అమరులైరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. రెండవ అనుచరుని పేరు హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ నఖమ్ వర్గమునకు చెందినవారు. బనూ అసద్ వీరి మిత్రపక్షము. వారి ఉర్ఫ్ అబూఅబ్దుల్లాహ్ వుండెను. వాస్తవానికి హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ యెమెన్ వాస్తవ్యులు. హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ మరియు వారి బానిస సాద్ మక్కా నుండి మదీనాకు ప్రస్థానము చేసినప్పుడు ఇద్దరు కూడ హజ్రత్ ముజ్జిర్ అబీ ముహమ్మద్ బిన్ ఉఖ్బా గారి వద్ద వుండిరి. హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ బదర్, ఉహద్, ఖందక్ యుద్ధములతో పాటు మిగతా అన్ని యుద్ధములలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి బాణము విసురువారిలో వుండిరి. మూర్ఖత్వ కాలములో హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ ఖురైష్ అశ్వరోధకులలో, కవులలో ఒకరని కొందరంటారు. హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ

ఉబైదుల్లాహ్ బిన్ హమీద్ బానిసగా వుండిరని, అనంతరం మకాతిబత్ (ధనము చెల్లించి స్వతంత్రత పొందుట) ద్వారా స్వతంత్రత పొందిరని కొందరంటారు. కాని మకాతిబత్ పరిహారమును మక్కా విజయము తరువాత చెల్లించిరి. హజ్రత్ ఉమ్మె సల్మా ఇట్లనిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నాకు వివాహ సంబంధ సందేశము పంపినప్పుడు హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ ద్వారా పంపిరి. మరో కథనములో ఇట్లు గలదు. హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅతో హజ్రత్ అనస్ బిన్ మాలిక్ ఇట్లు వినిరి. వారిట్లనేవారు. నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ఉహద్ రోజున రక్తసిక్తమైన తమ ముఖమును శుభ్రపరచు కొనుచుండిరి. ఎవరు మిమ్ములను ఇలా గాయపరచినారని హాతిబ్ అడిగిరి. అత్బ బిన్ అబీ వఖ్ఖాస్ నా ముఖముపై రాయి విసిరినాడని వారు సల్లల్లాహు అలైహి వసల్లం సమాధానమిచ్చిరి. హజ్రత్ హాతిబ్ ఇట్లనిరి. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హతమార్చబడిరను మాటలను నేను పర్వతముపై వింటిని. ఈ మాటలను విని ఇదే స్థితిలో అనగా ప్రాణము లేని విధముగా ఇక్కడికి వచ్చాను. హజ్రత్ హాతిబ్ అత్బ వైపు వెళ్లిరి. అతడు దాక్కొని వుండెను. అతన్ని వశపరచుకొనుటలో వారు సఫలమైరి. హజ్రత్ హాతిబ్ ఖడ్గముతో అతని తలను మొండెముతో వేరు చేసిరి. అతని తల, అతని సామాగ్రి, అతని అశ్వమును పట్టుకొని నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరిరి. వారు సల్లల్లాహు అలైహి వసల్లం హాతిబ్ కొరకు ఇట్లు దుఆ చేసిరి. అల్లాహ్ నీతో రాజీ పడుగాక! అల్లాహ్ నీతో రాజీ పడుగాక! అని రెండు సార్లు అనిరి.

హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ హిజ్రి 30వ సం॥లో 65 సం॥ల వయసులో మృతి చెందిరి. హజ్రత్ ఉస్మాన్ (రజి) వారి అంత్యక్రియ ప్రార్థన చదివించిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హాతిబ్ బిన్ అబీ బల్తఅ ద్వారా ఒక ఉత్తరము ఈజిప్టు గవర్నరు మఖూఖస్‌నకు పంపిరి. ఖైసర్ నాయకత్వములో ఈజిప్టు, ఇస్కందరియా (దేశముల) కు గవర్నరుగా వుండెను. అనగా వారసత్వముతో గవర్నరుగా వుండెను. ఖైసర్ వలె క్రైస్తవ మతమును పాటించేవాడు. అతని స్వంత నామము జరీజ్ బిన్ మీనా. అతడు అతని పౌరులు ఖబ్తీ జాతికి చెందినవారు.

ఉత్తరములో ఇట్లు వ్రాయబడెను. అడగనిదే ఇచ్చువాడు, పరమకారుణ్యమూర్తి, కర్మలకు ఉత్తమోత్తమ ఫలితము అందించే అల్లాహ్ నామముతో ప్రారంభించుచున్నాను. అల్లాహ్ దాసుడు, అతని ప్రవక్త అయిన ముహమ్మద్ తరపున ఈ ఉత్తరము ఖబ్తీల నాయకుడు మఖూఖస్ పేరున వ్రాయబడినది. మార్గదర్శనము పొందినవానికి శాంతి ఆశీస్సులు. అనంతరం తెలుపునదేమనగా ఓ ఈజిప్టు గవర్నరు! నేను తమరిని ఇస్లాం వైపు ఆహ్వానించుచున్నాను. ఇస్లాంలో చేరి అల్లాహ్ శాంతిని పొందుము. మోక్షమునకు ఇప్పుడు మార్గము ఇదొక్కటే. అల్లాహ్ తఆలా నీకు రెండింతలు పుణ్యము అందించును. కాని మీరు తిరస్కరించినచో మీతో పాటు మీ ఖబ్తీల పాపమునకు కూడ మీరే బాధ్యులగుదురు. ఓ గ్రంధము పొందిన ప్రజలారా! మనము అల్లాహ్‌ను తప్ప మరెవరిని ఆరాధింపము. దేనిని కూడ అతనికి భాగస్వామిగా జత చేయము. మనలో ఎవ్వడు ఎవడిని అల్లాహ్‌కు తప్ప ప్రభువుగా ఎన్నుకొనడు. ఈ విధముగా మీకును, మాకును సమానముగా వర్తించు కట్టుబాటు చేసి కొందుము రండు. వారు కాదన్నచో నీవు ఇట్లనుము. నిశ్చయముగా మేము విశ్వాసులము. మీరు దీనికి సాక్షులు.

మఖూఖస్ ఉత్తరము చదివిన తరువాత హాతిబ్ బిన్ అబీ బల్తఅనుద్దేశించి హాస్యపూర్వకంగా అతడిట్లనెను. మీ ఈ నాయకుడు అనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన ప్రవక్త అయినచో ఈ ఉత్తరము పంపే బదులు నాకు వ్యతిరేకంగా నాపై వారికి అధిపత్యము కలిగేందుకు ప్రార్థన ఎందుకు చేయలేదు. హాతిబ్ ఇట్లు సమాధానమిచ్చిరి. మీరు సంధించుచున్న ఈ విమర్శ సరియైనచో ఇది హజ్రత్ ఈసా అలైహిస్సలాంనకు కూడ వర్తించును. వారు తమ వ్యతిరేకులకు విరుద్ధముగా ఇటువంటి ప్రార్థన ఎందుకు చేయలేదు? అనంతరం హాతిబ్ ఉపదేశించుచు మఖూఖస్‌తో ఇట్లనిరి. మీరు చాలా నిర్మల మనస్సుతో ఆలోచించండి. ఎందుకనగా ఇంతకు ముందు మీ దేశమైన ఈజిప్టులో ఫిర్ఔన్ అను వ్యక్తి మృతి చెందెను. తానే మొత్తం ప్రపంచానికి దేవున్నని, సర్వాధికారి అని ప్రకటించుచుండెను. అతన్ని దేవుడు ఎలా శిక్షించినాడనగా అతడు గతించిన వారికి, భవిష్యత్తు తరాలకు గుణపాఠంగా మిగిలిపోయెను. కనుక నేను సదుద్దేశముతో మీకు తెలుపనదేమనగా మీరు ఇతరుల పరిస్థితులతో గుణపాఠం పొందండి. ఇలా కానిచో ఇతరులు మీ ద్వారా గుణపాఠం పొందుతారు. ఇంత సాహసముతో చెప్తున్నారని మఖూఖస్ చూచి ఇట్లనెను. మేము మొదటి నుండి ఒక మతములో కొనసాగుచున్నాము. కనుక మాకు

ఇంతకంటే మెరుగైన మతము లభించనంత వరకు మేము దీనిని అనగా క్రైస్తవ మతమును విడిచిపెట్టలేము. ఇస్లాం ఎటువంటి సంపూర్ణ మతమనగా దానిని స్వీకరించినచో ఇతర మతముల అవసరం లేదు. ఇది చివరి మతము. ఇతర మతములన్నియు ఇందులో విలీనమైపోయినవి. మీరు ఈసా అలైహిస్సలాంను నమ్ముటకు ఇది ఎలాంటి ఆటంకము కలిగించదు. ఎందుకనగా ప్రవక్తలందరిని విశ్వసించవలెనని ఇది ఆదేశించును. హ్రజత్ ఈసా గురించి హ్రజత్ మూసా శుభవార్త అందించినట్లే మీ ప్రవక్త కూడ మా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గురించి శుభవార్త అందించిరి. అప్పుడు మఖూఖస్ ఏమో ఆలోచించుచు మౌనము పాటించెను. అనంతరం మరో సమావేశములో కొందరు పెద్ద పెద్ద పాద్రీలు ఉపస్థితులై వుండగా మఖూఖస్ హాతిబ్‌నుద్దేశించి ఇట్లనెను. మీ ప్రవక్త తమ దేశము నుండి బహిష్కరించబడిరని నేను విన్నాను. వారప్పుడు తమ వ్యతిరేకుల గురించి శాపమునెందుకు కోరలేదు. హాతిబ్ ఈ విషయము విని ఇట్లు సమాధానమిచ్చిరి. మీ మసీహ్‌ని యూదులు పట్టుకొని శిలువపై ఎక్కించి హతమార్చాలని చూచిరి. అయినను వారు తమ విరోధులకు వ్యతిరేకంగా శాపము కోరి వారిని హతమార్చలేక పోయిరి. ఈ సమాధానము విని మఖూఖస్ చాలా ప్రభావితుడై ఇట్లనెను. నిశ్చయముగా ఒక వివేకుని తరపున తెలివిగల దూతగా నీవు వచ్చితివి.

ఈ ఉత్తరము ద్వారా దెలియునదేమనగా ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం దూతతో మఖూఖస్ చాలా మర్యాదగా వ్యవహరించెను. అతడు వారి సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటనలో కొంత మేరకు ఆసక్తిని చూపెను. ఏది ఏమైనప్పటికి అతడు ఇస్లాం స్వీకరించలేదు. అతడు క్రైస్తవ మతంలో వుండగానే మృతిచెందాడని ఇతర కథనములతో తెలుస్తున్నది. మఖూఖస్‌నకు వ్రాసిన ఉత్తరము గురించి ఒక అదనపు విషయము తెలుపుచు హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. రోమ్ రాజుకు వ్రాసిన ఉత్తరములోని అంశమే ఇందులో వుండెను. అందులో వున్న తేడా ఏమనగా మీరు విశ్వసించనిచో రోమ్ పౌరుల పాపము మీపై పడును. ఇందులో ఖిబ్తీల పాపము మీపై పడునని వుండెను. హాతిబ్ (రజి) ఈజిప్టు చేరినప్పుడు మఖూఖస్ తన రాజధానిలో కాక ఇస్కందరియాలో వుండెను. హాతిబ్ అస్కందరియా వెళ్ళిరి. అక్కడ సముద్ర తీరాన రాజు ఒక సమావేశము జరుపుచుండెను. చుట్టు పహారా వుండెను. వారు (హాతిబ్) దూరము నుండే ఉత్తరమును పైకి లేపి చూపుచు అరవడం మొదలు పెట్టిరి. ఇది గమనించి ఆ వ్యక్తిని తీసుకొచ్చి రాజు సమక్షములో ప్రవేశపెట్టాలని రాజు ఆజ్ఞాపించెను.

చాలా ధైర్యము, అతి తెలివితో ప్రచార బాధ్యతలను వీరు నిర్వర్తించారు. ఒక అధికారి, గవర్నరు లేదా రాజుతో వారు భయపడలేదు.

హ్రజత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ మక్కా విజయము కంటే ముందు ఒక ఉత్తరము ద్వారా మక్కా వారికి ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా ప్రయాణము గురించి సందేశము పంపించుటకు ప్రయత్నించిరి. ఇటువంటి సమాచారముతో కూడిన ఒక ఉత్తరము మక్కాకు వెళ్లుచున్న ఒక స్త్రీకి వారిచ్చిరి. ఈ విషయము ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అల్లాహ్ తఆలా తెలిపెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హ్రజత్ అలీతో పాటు మరికొందరు అనుచరులను ఆ మహిళ వెనుక పంపించిరి. వారు ఆ ఉత్తరమును ఆ మహిళతో లాక్కొని తెచ్చి ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అందించిరి. హ్రజత్ హాతిబ్‌ను నీవిలా ఎందుకు చేసినావని ఆంహుజర్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రశ్నించిరి. ఈ పనిని నేను ఏదో అవిశ్వాసము లేదా దాంబికము వలన చేయలేదు. నా బంధుమిత్రుల ఉపకారమును తీర్చుటకు ఇలా చేసితినని వారు సమాధానిమిచ్చిరి. నీవు చెప్పినది నిజమేనని వారు సల్లల్లాహు అలైహి వసల్లం వారిని క్షమించిరి.

హ్రజత్ అబూబకర్ (రజి) కూడ హ్రజత్ హాతిబ్‌ను ఈజిప్టు గవర్నరు మఖూఖస్ వద్దకు పంపిరి. అప్పుడు వారొక ఒప్పందము కుదిర్చిరి. హ్రజత్ అమర్ బిన్ ఆస్ ఈజిప్టుపై దాడి చేసేంత వరకు ఇరువురి మధ్య ఈ శాంతి ఒప్పందము కొనసాగినది.

హ్రజత్ హాతిబ్ గురించి మరికొన్ని వివరములు ఇట్లు గలవు. చాలా అందమైనవారు, గడ్డము వొత్తుగావుండెను. ఎత్తు తక్కువుండిరి. వ్రేళ్లు చాలా దొడ్డుగా వుండేవి.

యకూబ్ బిన్ అత్బ ఇట్లు ఉల్లేఖించిరి. హ్రజత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ మృతి చెందక ముందటి రోజు

నాలుగు వేల దిర్హమ్, దీనార్లు కలిగి వుండిరి. వారు దాన్యపు వ్యాపారము చేసేవారు. తమ ధనమును మదీనాలో వీడిరి. హజ్రత్ జాబిర్ (రజి) ఇట్లు ఉల్లేఖించిరి. ఒక సారి హజ్రత్ హాతిబ్ బానిస రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఓ అల్లాహ్ ప్రవక్త! హాతిబ్‌ను అల్లాహ్ తఆలా తప్పక నరకములో పడవేయునని ఫిర్యాదు చేసెను. అతన్ని వారు కోపగించి వుండవచ్చును. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతన్ని ఇట్లు మందలించిరి. అతడు అందులో (నరకములో) ఎట్టి పరిస్థితిలో ప్రవేశించడు. ఎందుకనగా అతడు బదర్ యుద్ధములో, హుదైబియా శాంతి ఒప్పందములో పాల్గొన్నాడు.

ఒక సారి హాతిబ్ మదీనా వీధులలో ఎండిపోయిన అంగూరములు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు విక్రయించుచుండిరి. ఇంతలోనే హజ్రత్ ఉమర్ (రజి) అక్కడికి వచ్చిరి. మీరు మీ గృహములో ఈ అంగూరములను విక్రయించుకోవాలని సూచించిరి. మార్కెట్ (వీధి)లో ఇంత తక్కువ ధరకు మీరు విక్రయించుట భావ్యము కాదు. దీనితో మార్కెట్ ధర తగ్గిపోతుంది. హజ్రత్ ఉమర్ (రజి) ఈ ఆదేశము ఆచరించదగదని విద్యావంతులు నిర్ణయించారు. వీధులలో ధరను నిర్ణయించే బాధ్యత ఇస్లామీయ ప్రభుత్వముదని అంటారు.

కంచెలు, అక్కడ త్రాగునీటి కొరకు బావులను తవ్వించుట ఇస్లామీయ ప్రభుత్వ బాధ్యత. ఒకసారి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ హాతిబ్‌తో ఒక కంచెలో ఒక బావి తవ్వించిరి. హదీసులలో ఇట్లు గలదు. బనూమస్తలక్ యుద్ధము నుండి తిరిగి వచ్చుచున్నప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నకీ ప్రాంతము నుండి వెళ్ళిరి. అక్కడ విశాల ప్రాంతము, గడ్డిని చూచిరి. చాలా బావులుండెను. అక్కడి భూమి నీరు కూడ మంచిగా వుండెను. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఆ బావుల నీటి గురించి అడిగిరి. ఓ అల్లాహ్ ప్రవక్త! నీరు చాలా మంచిగానే వుంది, కాని మేము ఈ బావులను ప్రశంసించినప్పుడు వాటి నీటిమట్టం తగ్గిపోతుంది. బావులు నిరుపయోగంగా మారిపోతాయని అనిరి. అందుకు అక్కడ ఒక బావి త్రవ్వాలని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ హాతిబ్ అబీ బల్తఅను ఆదేశించిరి. అనంతరం అక్కడి నకీ ప్రాంతమును కంచెగా మార్చాలని ఆదేశిచిరి.

హజ్రత్ హాతిబ్ అబీ బల్తఅ సద్గుణములను ప్రస్తావించుచు 'సీరతుస్సహాబ' పుస్తక రచయిత ఇట్లు వ్రాసిరి. చాలా విశ్వసనీయులు. ఉపకారమును గుర్తించేవారు, స్పష్టముగా సత్యము పలకడం వారి ప్రత్యేక గుణాలు. బంధుమిత్రులను బాగోగులను చాలా చక్కగా చూసుకునేవారు. మక్కా విజయము సమయమున అన్యారాధకులకు వ్రాసిన ఉత్తరమును నేనింతకు ముందు ప్రస్తావించినాను. బంధువుల సహాయము వల్లనే వారలా చేసిరి. వారి ఈ సహాయ సహాకారముల వల్లనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ వారి సదుద్దేశము, మంచితనము వల్లనే వారిని క్షమించిరి. అల్లాహ్ తఆలా ఆయా అనుచరుల గొప్ప విశిష్టతలను పాటించు అనుగ్రహము మనకు కలిగించుగాక! వారి స్థాయి అంతస్థులను పెంచుగాక! (ఆమీన్)

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

..........................................................................

..........................................................................

..........................................................................